క్లుప్తంగా

లో ఓల్టేజ్ సమస్య తీర్చాలి



ఏడీకి వినతిపత్రం ఇస్తున్న రాంరెడ్డి, కాలనీవాసులు

బడంగ్‌పేట్: కాలనీలల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలు తీర్చాలని బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాలనీవాసులు విద్యుత్ శాఖ ఏడీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని 26వ డివిజన్‌లోని గడ్డం ఎన్‌క్లేవ్‌లోని ఫేస్-1, 2, 3లో లో ఓల్టేజ్ సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా తిరుమల నగర్‌లో ఇలాంటి సమస్య ఉందన్నారు. ఇందుకు గాను మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేసి లో ఓల్టేజీ సమస్య తీర్చాలని విన్నవించారు. వాటితో పాటు రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను తొలగించి సురక్షితమైన స్థలంలో ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే కృషి చేస్తానని ఏడీ వారికి హామీనిచ్చారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్ నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎల్‌బీనగర్ ఫీడర్ పరిధిలోని సరస్వతీనగర్, చింతలకుంట, సూర్యోదయనగర్‌కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, 11కేవీ ఆలిండియా రేడియో ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

సమన్వయంతో పని చేశా



జెడ్పీటీసీ జంగారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

కందుకూరు: ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగుస్తున్న సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జెడ్పీటీసీలను అధికారులు, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ క్రమంలో మండలం జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డిని సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాగా ఈ సందర్భంగా జంగారెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా కష్టపడి ప్రజలకు సేవలందించామన్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమన్వయంతో కలిసి పని చేశామన్నారు. తమ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. తనకు సహకరించిన తోటి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన ప్రజలు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజాపాలనలో భాగంగా గతంలో లబ్ధిదారులు ఇచ్చిన దరఖాస్తుల వివరాలను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కానీ గృహజ్యోతి కింద చాలా మంది లబ్ధిదారులకు జీరో బిల్లు రాకపోవడంతో ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో గత నెల 15వ తేదీ నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి లబ్ధిదారులు క్యూ కట్టారు. లబ్ధిదారుల నుంచి సిబ్బంది దరఖాస్తులను తీసుకొని వెంటనే వివరాలను నమోదు చేసి సెల్ ఫోన్‌లో వచ్చే ఓటీపీ ద్వారా ప్రక్రియను పూర్తి చేస్తున్నారు. కాగా చాలా మంది లబ్ధిదారులు తమ వివరాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? అని మరోసారి వచ్చి పరిశీలించుకుంటున్నారు.

రోడ్డుపై మురుగు.. వేసేదెలా అడుగు?

గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీని ఫలితంగా మురుగునీరు రోడ్డుపై చేరి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తోంది. సాఫీగా గమ్యాన్ని చేరుకోవాల్సిన ప్రయాణికులు దుర్గంధంతో ముక్కు పట్టుకోవాల్సిన దుస్థితి దాపురించింది.

- ఏడాదిగా చిత్తాపూర్-తిప్పాయిగూడ దారిపై నిలిచిన వ్యర్థజలం
- పట్టించుకోని అధికారయంత్రాంగం



చిత్తాపూర్-తిప్పాయిగూడ రోడ్డుపై నిలిచిన మురుగునీరు

మంచాల: రోడ్డుపై గ్రామంలోని మురుగు నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఏళ్ల తరబడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. మంచాల మండలంలోని చిత్తాపూర్‌లో మురుగునీరు తిప్పాయిగూడ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై ఏడాదికాలంగా దర్శనమిస్తోంది. దీని ప్రధాన కారణం గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడమే. మురుగునీరు రోడ్డుపై చేరి దుర్గంధంతోపాటు గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది నెలకొంది. ఆయా గ్రామాల ప్రజలు అనేకసార్లు ప్రభుత్వాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. చూస్తాం, చేయిస్తామని చెప్పడం తప్ప క్షేత్రస్థాయితో మరమ్మతులు జరిగిన దాఖలాలు లేవు. దీంతో ద్విచక్రవాహనాల రాకపోకలకు సైతం కష్టంగా మారింది.

రాచకొండకు వెళ్లాలంటే..

ఇబ్రహీంపట్నం నుంచి రాచకొండగుట్టలకు వెళ్లాలంటే ఈ మార్గాన్నే స్థానికులు ఎక్కువగా ఉపయోగిస్తారు. రంగారెడ్డి జిల్లాతో పాటు పక్కన ఉన్న యాదాద్రిభువనగిరి జిల్లాకు సైతం ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అంతటి ప్రాధాన్యం ఉన్న రహదారిపై మురుగు నీరు ఒక్కసారిగా నిలిచిపోవడంతో వాహనాలకు అవరోధంగా మారింది. కొన్నిసార్లు ద్విచక్రవాహనదారులు మురుగు నీరు పడకుండా వెళ్తున్నప్పుడు కింద పడిన ఉదంతాలున్నాయి. రాత్రిపూట ఈ రోడ్డు మీద ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని గ్రామస్తులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ సాయినాథ్‌గౌడ్ వివరణ కోసం ఫోనులో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అవస్థ పడుతున్నాం



తిప్పాయిగూడ గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం, మంచాల మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఈ రోడ్డు ఒక్కటే దిక్కు. ఏడాది కాలంగా దీని మీద మురుగు నీరు పారుతుంది. గోతులు ఏర్పడి వాహనాల రాకపోకలకు అడ్డంకిగా మారింది. పరిసరాలన్నీ దుర్వాసనతో అలుముకున్నాయి.

– మధు, తిప్పాయిగూడ

అధికారుల నిర్లక్ష్యం



రహదారి మీదుగా నిత్యం వందలాది మంది ప్రయాణం చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు ప్రమాదకరంగా మారింది. అధికారులు నిర్లక్ష్యం వీడి స్పందించాలి. ప్రజలు మురుగు నీటితో రాక పోకలు సాగించడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– రమేశ్, చిత్తాపూర్

స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి



పులందరివాగులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న చైర్మన్ నిరంజన్‌రెడ్డి, అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్లను స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతానని చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో ఆయన గడప గడపకు తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంగళ్‌పల్లి పటేల్‌గూడలో ప్రధాన రహదారి పక్కన పులందరి వాగులో పేరుకుపోయిన మురికి, చెత్త చెదారాన్ని జేసీబీతో తొలగించారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇరిగేషన్ అధికారులకు వాగు హద్దు రాళ్లను పాతాలని సూచించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రానున్న రోజుల్లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేద్దామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. ప్రజల సౌకర్యార్థం వీధి దీపాలు, తాగునీరు తక్షణమే ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది క్రమం తప్పకుండా పనులు చేయాలని సూచించారు. పట్టణ ప్రజలు చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కమాండ్ల యాదగిరి, కమిషనర్ బాలకృష్ణ, ఏఈ వీరాంజనేయులు, మేనేజర్ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ పొట్టి అయిలయ్య, మాజీ సర్పంచ్ భాస్కర్‌గౌడ్, మర్రి రాంరెడ్డి, అశోక్‌రెడ్డి యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

సమాజంలో విద్యార్థి పాత్ర కీలకం

సీఐ శివ ప్రసాద్



మాట్లాడుతున్న సీఐ శివ ప్రసాద్

కడ్తాల్: విలువలతో కూడిన నవ సమాజాన్ని నిర్మించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని సీఐ శివ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో విద్యార్థి స్కూల్ పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించారు. ఆరు విభాగాల్లో 19 మంది విద్యార్థులు పోటీ చేయగా, అనంతరం విజేతలను ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ శివ ప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ మాట్లాడుతూ.. నవ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులు చదువు పట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. చెడు అలవాట్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థుల్లో మార్పు తీసుకువచ్చే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. అదే విధంగా విద్యార్థులకు నైతికత, ఈవ్ టీజింగ్, యాంటీ డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సువర్ణ గోవర్ధన్‌రెడ్డి, హెచ్ఎం జైసన్ కేజే, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాషయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మంచాల: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడంలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దన్నె బాషయ్య ఆరోపించారు. బుధవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు బండి రాజుగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాషయ్య మాట్లాడుతూ.. గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:100 ప్రకారం క్వాలిఫై చేయాలన్నారు. గ్రూప్2, గ్రూప్3 నోటిఫికేషన్లలో అదనంగా పోస్టులను పెంచాలన్నారు. 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీని నిర్వహించాలన్నారు. అన్ని నియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. అలాగే నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగయ్యగౌడ్, రాజు, రాజేందర్‌రెడ్డి, కొండల్, వెంకటేశ్, శివగౌడ్, సందీప్, విజయ్, వెంకట్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



సమస్యల గురించి జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం : నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లవారుజామున ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి హస్తినాపురంలోని సాయిప్రకాశ్‌నగర్ కాలనీలో ఎమ్మెల్యే మార్నింగ్ వాక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ డీసీపీ జకియా సుల్తానా, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న దండోరా రజతోత్సవాలు

మలక్‌పేట: నగరంలోని రవీంద్రభారతిలో ఈనెల 7న జరిగే దండోరా రజతోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ అన్నారు. మూసారంబాగ్‌లో బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి రజతోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాల అభ్యున్నతికి ఎస్సీ వర్గీకరణే అంతిమ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాలుగా పోరాటం కొనసాగిస్తుందన్నారు. వర్గీకరణపై పాలకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మలక్‌పేట నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో మాదిగ, మాదిగ ఉపకులాలను ఉత్సవాలకు తరలించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇమ్మడి నాగయ్య, బట్టు రామకృష్ణ, సోమయ్య, మహిళలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి

మన్సూరాబాద్ : బీగ్‌బజార్ నుంచి సుష్మా చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. బుధవారం మన్సూరాబాద్ డివిజన్ పర్యటనలో భాగంగా జోనల్ కమిషనర్‌ను కార్పొరేటర్ కలిసి ట్రాఫిక్ సమస్య తీవ్రతపై వివరించారు. పెరుగుతున్న కాలనీలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణంతో వాహనాల రద్దీ పెరిగి రోడ్డు ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వివరించారు. అదే విధంగా నష్టపరిహారం త్వరగా చెల్లిస్తే విస్తరణ పనులు వేగవంతంగా చేపట్టవచ్చని జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వివరించారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

నాగోలు: చిన్నారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏఎస్ఐ సోమనాథ్ అన్నారు. బుధవారం ఎల్‌బీనగర్ ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ట్రాఫిక్ చిల్డ్రన్ పార్క్‌ను ఓ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ట్రాఫిక్ శిక్షణ పార్క్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్, సూచనలు, నమూనాలు, రంగు రంగుల చిత్రాల సైన్ బోర్డుల గురించి విద్యార్థులకు వివరించారు. చిత్రాలతో పిల్లలను ఆకట్టుకునేలా వాహన ప్రయాణంపై జాగ్రత్తలను తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనలను పుస్తకాలు, కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీటీఐ సిబ్బంది రమేష్, సాధిక్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నాగోలు: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్‌తో కలిసి డివిజన్ పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ కాలనీలో ఏక్ పేడ్ మాకే నామ్(అమ్మ పేరుతో ఒక మొక్కను నాటారు). ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ మాట్లాడుతూ.. జన్మనిచ్చిన తల్లిని మనమంతా ప్రేమిస్తామని, ఆమెకు గుర్తుగా లేదా గౌరవార్థంగా ఒక మొక్కను నాటాలన్నారు.



మీర్‌పేట ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న శశిధర్‌రావు, నాయకులు

మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

- గణేశ్ మండపం కూల్చివేతపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

మీర్‌పేట: బడంగ్‌పేట సప్తగిరి కాలనీలో గణేశ్ ఉత్సవ మండపాన్ని తొలగించిన కార్పొరేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి రావి నూతల శశిధర్‌రావు, బీజేపీ నాయకులు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శశిధర్‌రావు మాట్లాడుతూ.. కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో కాలనీవాసులందరి ఆమోదంతో దాదాపు రూ.10లక్షల వ్యయంతో గణేశ్ మండపాన్ని నిర్మించామన్నారు. ఇటీవల బడంగ్‌పేట కార్పొరేషన్ అధికారులు మండపాన్ని తొలగించడంతో పాటు హిందూ దేవతామూర్తుల చిత్రపటాలను సైతం జేసీబీతో తొలగించి మనోభావాలను దెబ్బతీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజును కోరారు. కార్యక్రమంలో బడంగ్‌పేట బీజేపీ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, సంజయ్‌శర్మ, వివేకానంద జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, మీర్‌పేట కార్పొరేటర్ పసునూరి భిక్షపతిచారి, సప్తగిరి కాలనీవాసులు పాల్గొన్నారు.

'నేడు విద్యాసంస్థల బంద్'

మలక్‌పేట : దేశంలో విద్యారంగం పట్ల మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ గురువారం కేజీ టూ పీజీ వరకు దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్ పిలుపునిచ్చారు. దిల్‌సుఖ్‌నగర్‌లో బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీట్, యూజీసీ నెట్ పరీక్ష పేపర్ల లీకేజీ వల్ల నష్టపోయిన విద్యార్థులకు భరోసా కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. విద్యా సంస్థల బంద్‌కు ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మహమూద్, అనిల్‌కుమార్, వంశీ, రాహుల్, దశరథ, అంజి తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్ ఆధునికీకరణకు కృషి



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్ : సరూర్‌నగర్ రైతుబజార్ ఆధునికీకరణకు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పటోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం రైతుబజార్‌ను గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సెక్రటరీ చిలుక నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 1994 -95 లో ఏర్పాటు చేసిన నిర్మాణం కావడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, షెడ్లులో నిర్మాణాన్ని కొంచం ఎత్తు పెంచి గాలి, వెలుతురు వచ్చే విధంగా నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్లపై వ్యాపారం చేసుకునే తోపుడు బండి వ్యాపారులకు రైతు బజార్‌లో అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మార్కెట్‌లో రైతులకు నూతన మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం బీజేఆర్ భవనాన్ని పరిశీలించి అత్యాధునిక వసతులతో ఆధునీకరించాలని అసిస్టెంట్ ఎస్సీ డెవలప్మెంట్ డిపార్ట్‌మెంట్ అధికారిణి కుసుమ లావణ్యకు సూచించారు. బీజేర్ భవన్‌లో వంట చేసుకునే విధంగా వెనుక భాగంలో రేకుల షెడ్డు నిర్మాణం కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో ఆధునీకరణ కోసం రూ. 4 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈఓ స్రవంతి రెడ్డి, డీఈ రవీందర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, యూత్ వింగ్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నర్సింహాగౌడ్, నాయకులు అరవింద్, పెండ్యాల నగేష్, సాజిద్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, ఊర్మిలరెడ్డి, శ్యామ్‌గుప్తా, మహేందర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, శేఖర్, పెంబర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాలాలు శుభ్రంగా ఉండేలా చూడాలి

చైతన్యపురి : మురికి కాలువలు, నాలాలు పరిశుభ్రంగా ఉండేలా కృషి చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని వీవీనగర్ శ్రీరామకృష్ణ శారదా విద్యాలయం వద్ద నాలా పూడికతీత పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వరదనీరు సాఫీగా వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడూ నాలాలు, మురికి కాలువలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ కవర్లు తొలగిస్తే ముంపు సమస్య తలెత్తకుండా ఉంటుందన్నారు. నాలాల్లో తొలగించిన వ్యర్థాలను రహదారులపై వేయకుండా ఉండాలని సూచించారు. వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సిద్ధు, షేక్ ఉమర్, సతీష్‌రెడ్డి, రఘునందన్, జోషి, టింకు, రాము తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి బాసట



ఆమనగల్లు: బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న టిప్పు సుల్తాన్

ఆమనగల్లు: తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. స్నేహితుడి కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం చేసి మానవత్వం చాటుకున్నారు. ఆమనగల్లు పట్టణంలోని నలంద విద్యాలయంలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులలో ఒకరైన మున్న పాషా రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో తోటి స్నేహితులంతా కుటుంబానికి అండగా ఉండాలని భావించారు. అందులో ఉప్పల వెంకటేశ్ మిత్రమండలి అధ్యక్షుడైనా టిప్పు సుల్తాన్ చొరవ తీసుకుని నగదును సేకరించారు. ఈ మేరకు బుధవారం మున్నాపాషా కుటుంబ సభ్యులకు రూ.లక్ష నగదు అందించారు. కార్యక్రమంలో తోటి విద్యార్థులు ప్రకాశ్, భాస్కర్, సతీష్, లక్ష్మణ్, ఆనంద్, ఫరీద్, సౌజన్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి..

కడ్తాల్: మండలంలోని ముద్విన్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాన్ని మండలానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి సంఘం తరపున రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వెంకటేశ్, యాదగిరి, లక్ష్మణ్, సత్తయ్య, శ్రీను, పెద్దమోని శ్రీను, కేతావత్ శ్రీను, బీబీబేగం, రమేశ్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికురాలి..

తలకొండపల్లి: మండలంలోని యడవల్లి ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పని చేస్తున్న కమలమ్మ ఇటీవల మృతిచెందారు. బుధవారం భోజన కార్మికుల జిల్లా కార్యదర్శి స్వప్న యడవల్లికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు రూ.8 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. వెల్జాల్‌లో అనసూయ(74) అనారోగ్యంతో మృతి చెందడంతో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబానికి రూ.మూడు వేలు అందజేశారు.

చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

కడ్తాల్: మండలంలోని కానుగుబావితండాకు చెందిన నేనావత్ ధర్మనాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబాన్ని బుధవారం జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ సేవ్యానాయక్, నాయకులు హరిచంద్, పాండునాయక్, లక్పతినాయక్, శ్రీను తదితరులు ఉన్నారు.